

నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 కార్డ్ విధానాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో పెన్‌డౌన్ చేపట్టినట్లు దస్తావేజు లేఖరులు తెలిపారు. ఎపి స్టేట్ డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు లేఖరులు ప్రకటించారు. ఈ విధానం వల్ల ఆస్తుల్లో తగాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేలాది మంది లేఖరుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని నిరసిస్తూ పెన్‌డౌన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉండి: ఈ నెల 30, 31 తేదీల్లో దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌ను విజయవంతం చేయాలని సీనియర్ దస్తావేజు లేఖరులు మునుకోలు సింహాచలం, కొమ్మన రాఘవ సూచించారు. మంగళవారం ఉండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బి.రవిబాబు, నందుల నారాయణమూర్తి, వీర్రాజు, లోకారపు రాము, పాండురంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వట్లూరు వెమ్‌టెక్నాలజీ బాధిత రైతుల పరిస్థితి అగమ్యగోచరం
ఏడేళ్లు దాటినా అందని పరిహారం
అప్పట్లో పరిశ్రమ పేరుతో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం
ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా ఒప్పందం
ప్రభుత్వం మారడంతో పరిశ్రమ ఏర్పాటు వెనక్కి
మా భూములు మాకివ్వాలంటున్న రైతులు

భూములూ లేవు.. పరిహారమూ లేదు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వట్లూరులో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ పేరుతో రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం పరిహారమూ ఇవ్వకుండా, భూములు లేకుండా చేసిన వైనమిది. ఏడేళ్లుగా తమకు న్యాయం చేయాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో తమ భూములు తిరిగిచ్చేయాలంటూ రైతుల రోడ్డెక్కుతున్నారు. అటు పరిహారం ఇవ్వకుండా, ఇటు భూములు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం రోడ్డున పడేసింది.

టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వెమ్‌టెక్నాలజీ పరిశ్రమను వట్లూరులో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి పెదపాడు మండలం వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలోని దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. దాదాపు 300 మంది సన్న, చిన్నకారు రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఈ భూములు చెరువు భూములుగా ఉన్నాయి. అయితే గడిచిన వందేళ్లుగా ఈ భూములను రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి అనే పేరుతో రైతులకు ఎటువంటి పరిహారమూ ఇవ్వకుండా భూములు లాగేసుకున్నారు. దీనిపై అప్పట్లో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం చెల్లించేలా నిర్ణయించారు. అయితే రైతులకు ఒక్క చిల్లిగవ్వ కూడా ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రభుత్వం మారడంతో పరిశ్రమ ఏర్పాటు వెనక్కిపోయింది. దీంతో అగ్రిమెంట్ రద్దు చేసుకుని 2022 ఏప్రిల్‌లో ఈ భూములను వెమ్ టెక్నాలజీ నుంచి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. రైతులు మాత్రం రోడ్డున పడ్డారు. ఎంతోమంది రైతులు ఆ భూములను ఆడపిల్లలకు పసుపు కుంకుమ కింద ఇచ్చి వివాహాలు చేశారు. వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోని దుస్థితి నెలకొంది.

మా భూములు మాకిచ్చేయండి: రైతులు

వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పేరుతో సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న వందల ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో పరిశ్రమ ఏర్పాటు లేదని తేలిపోయింది. ప్రస్తుతం భూములన్నీ బీడుగా ఖాళీగా ఉన్నాయి. పరిశ్రమ ఏర్పాటు చేయడం లేదని, పరిహారం ఇవ్వకపోవడంతో తమ భూములు తమకిచ్చేయాలని బాధిత రైతులు పోరుబాట పట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం వట్లూరులోని వెమ్ టెక్నాలజీ బాధిత రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

వట్లూరులో వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పేరుతో రైతుల నుంచి భూములు తీసుకుని ఏడేళ్లు దాటిపోయింది. ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. రైతులకు భూములు వెనక్కివ్వాలి. ప్రభుత్వ అవసరాలకు తీసుకుంటే పరిహారం చెల్లించాలి. ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసు కేసులు పెట్టడం సమంజసం కాదు. రైతులకు న్యాయం చేయకపోతే రైతుసంఘం బాధిత రైతులకు అండగా నిలబడి పోరాడుతుంది.

భూమిలేక ఆదాయం కోల్పోయాం

పిడిగే జోసఫ్, వట్లూరు, బాధిత రైతు

మా కుటుంబం మొత్తం ఐదెకరాల భూమిని కోల్పోయాం. దీంతో ఏడేళ్లుగా చిల్లిగవ్వ ఆదాయం లేని పరిస్థితి నెలకొంది. 2016లో భూములు తీసుకున్నప్పుడు ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇస్తామన్నారు. ఇప్పటి వరకూ రూపాయి ఇవ్వలేదు. పరిహారం ఇవ్వకుండా, పరిశ్రమ ఏర్పాటు చేయకుండా భూములను బీడుగా పెట్టారు. మా భూములు మాకిచ్చేస్తే సాగు చేసుకుంటాం. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నాం.

మా భూములు మాకివ్వాలి

వల్లముల రామాంజనేయులు, వట్లూరు

మా కుటుంబానికి సంబంధించి నాలుగెకరాల భూమి కోల్పోయాం. మా పిల్లలకు పసుపు కుంకుమ కింద ఇవే భూములిచ్చాం. ప్రభుత్వం చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. పరిశ్రమ నిర్మాణం ఆగిపోయింది. మా భూములు మాకిచ్చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రోడ్డున పడ్డ రైతులకు న్యాయం చేయాలి.

పెంచింది కొండంత.. తగ్గించింది గోరంత..!

మోడీ అధికారంలోకొచ్చాక సిలిండర్ ధర రూ.700కుపైగా పెంపు
ప్రస్తుతం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1136
గ్యాస్ నగదు బదిలీకి తిలోదకాలిచ్చిన బిజెపి సర్కార్
సిలిండర్‌పై రూ.200 తగ్గింపుపై అక్కా చెల్లెమ్మల పెదవివిరుపు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే మోడీ సర్కార్ అధికారంలోకొచ్చాక వంటగ్యాస్ సిలిండర్ పెరిగిన ధరకు, ప్రస్తుతం తగ్గించిన ధరకు అసలు పొంతన లేకుండాపోయింది. దీంతో పెంచింది కొండంత, తగ్గించింది గోరంత అంటూ జనం పెదవి విరుస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిది లక్షల వరకూ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. హెచ్‌పి, ఇండియన్, భారత్ వంటి గ్యాస్ సిలిండర్లను వినియోగదారులు వినియోగిస్తున్నారు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి వంటగ్యాస్ 14.2 కిలోల సిలిండర్ ధర రూ.410 మాత్రమే. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1136గా ఉంది. అంటే రూ.700కుపైగా సిలిండర్ ధర పెరిగింది. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సబ్సిడీ సొమ్ము వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో వేసేవిధంగా నిబంధనలు తెచ్చింది. మోడీ ప్రభుత్వం వచ్చాక నెలల వారీగా గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూ ప్రస్తుతం రూ.1136కు చేరింది. వంటగ్యాస్‌పై నగదు బదిలీ పథకాన్ని మోడీ సర్కార్ నిలిపివేసింది. దీంతో పూర్తిసొమ్ము చెల్లించి వినియోగదారులు సిలిండర్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో అత్యధిక గ్యాస్ వినియోగదారులు సామాన్య ప్రజానీకమే. ప్రతినెలా గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో రక్షాబంధన్ కానుకగా సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం వినియోగదారులకు ఏదో మేలు చేసినట్లు గొప్పలు చెబుతోంది. పెరిగిన ధరతో పోలిస్తే తగ్గిన ధర అతి స్వల్పమని జనం కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు.

గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ప్రారంభ సభలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సచివాలయానికి వచ్చే ప్రజల అవసరాలను, సమస్యలను ఓపిగ్గా విని మీస్థాయిలో చేయగలిగింది చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 821 మందికి నాలుగు బ్యాచ్‌లుగా ఆరు అంశాలపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా ప్రజా సేవకులమనే విషయాన్ని మరవకుండా మన దగ్గరికి వచ్చే ప్రజల సమస్యను ఓపిగ్గా వినాలన్నారు. మీ స్థాయిలో చేయగలిగింది చేయాలని, లేనిపక్షంలో సంబంధిత తహశీల్దార్, డిఎల్‌డిఒ, ఆర్‌డిఒలను కలువమని చెప్పవచ్చున్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో లేరనే మాట రాకూడదని ఆయన స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పంచాయితీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ శిక్షణను ఉపయోగించుకుని సమర్థవంతమైన సేవలను అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎండార్స్‌మెంట్ ఇవ్వకూడదని, ఇఒపిఆర్‌డిలు, ఎంపిడిఒలు ఇవ్వాలన్నారు. డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు చెందిన 423 మంది, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన 350 మంది శిక్షణలో పాల్గొంటారన్నారు. ఒక్కో బ్యాచ్‌కు మొత్తం ఆరు రోజులు రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఏలూరులో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, శిక్షణ కోఆర్డినేటర్ ప్రసంగిరాజు, డిఎల్‌డిఒ, కోఆర్డినేటర్ శిరీషా పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలపై సమీక్ష

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు గోనె సంచుల కొరత లేకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కీలకపాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలో ఎక్కువ శాతం ధాన్యం సేకరించు పలు పిఎసిఎస్ అధ్యక్షులు, కార్యదర్శులతో 2023-24 ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు చర్యలపై జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కోటి 50 లక్షలు గోనె సంచుల అవసరమవుతాయని అంచనా వేయగా ప్రస్తుతం 45 లక్షల గోనె సంచులు రైస్‌మిల్లర్ల వద్ద ఉన్నాయన్నారు. మిగిలిన గోనె సంచుల కొరతను అధిగమించడానికి గోనె సంచులను కొనుగోలు చేయాలని పిఎసిఎస్ అధ్యక్షులను ఆదేశించారు. ఆయా సొసైటీలు ఏమేర గోనె సంచులు కొనుగోలు చేసేది తీర్మానం చేసి ఇవ్వాలన్నారు. రవాణాకు సంబంధించి కూడా ట్రాక్టర్లు, చిన్నవాహనాలను ముందుగానే సిద్ధపరచుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ సెప్టెంబరులో కోతలు పూర్తయ్యి అక్టోబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళు ప్రారంభమయ్యే దృష్ట్యా రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమన్వయ లోపం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఆరు లక్షలు మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి రావచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారన్నారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, డిఎస్ఒ ఆర్‌ఎస్‌ఎస్‌ఎస్.రాజు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ

మోసకారి హామీలతో నిండా ముంచిన జగన్
ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం
యువగళం పాదయాత్రలో లోకేష్
పోలవరం నియోజకవర్గంలో కొనసాగిన యాత్ర


పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ టి.నరసాపురం/ చింతలపూడి

టిడిపి అధికారంలొకొచ్చాక పోలవరం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజి ఇచ్చే వెసులుబాటు ఉంటే కచ్చితంగా అందిస్తామని, గతంలో ఇచ్చిన ప్యాకేజీ హామీకి మాత్రం కట్టుబడి ఉన్నామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. 198వ రోజు యువగళం పాదయాత్ర మంగళవారం చింతలపూడి మండలం తీగలవంచలో ప్రారంభమై పోలవరం నియోజకవర్గంలో


మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

ప్రవేశించింది. పోలవరం నియోజకవర్గం ముత్యాలమ్మపేటలో ప్రవేశించిన లోకేష్ పాదయాత్రకు నాయకులు, కార్యర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. దారిపొడవునా జనం పెద్దఎత్తున తరలొచ్చారు. జనంతో మమేకమవుతూ లోకేష్ ముందుకు సాగారు. తీగలవంచ, టి.నరసాపురం, ఏపుగుంట, తిరుమలదేవిపేట, వెంకటాపురం గ్రామాలకు చెందిన ప్రజలు లోకేష్‌ను కలిసి తమ గ్రామాల్లోని సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ప్రజలు అందించిన వినతుల్లోని సమస్యల పరిష్కారానికి అధికారంలోకి వచ్చిన వెంటనే కృషి చేస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో శ్రీరామవరంలో పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖిలో లోకేష్ మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసితులు మాట్లాడుతూ జగన్ రూ.పది లక్షల ప్యాకేజీ ఇస్తామని చెప్పి మోసగించారన్నారు. నిర్వాసితులను ముంచి ఆయన హ్యాపీగా పడుకున్నాడని, వరదలు వచ్చినప్పుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. నిర్వాసితులు బతకడానికి ఇతర ప్రాంతాలకు వెళితే స్థానికులు కాదంటున్నారన్నారు. రీసర్వే పేరుతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని, 2017లో ఒకసారి సర్వే అయినా మరోసారి సర్వే అంటూ జగన్ ప్రభుత్వం వేధిస్తుందని తెలిపారు. ఊర్లు ఖాళీ చేయించి ప్రభుత్వం మాకు ఎటువంటి సాయమూ అందించలేదని తెలిపారు. 2017 కట్ ఆఫ్ డేట్ పెట్టి 18 ఏళ్లు ఉన్నవారికి ప్యాకేజీకి అర్హులుగా టిడిపి ప్రభుత్వం ప్రకటించగా జగన్ వచ్చిన తరువాత ప్యాకేజీ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. వైఎస్ హయాంలో భూములిచ్చిన వారికి అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానని జగన్ మోసగించారని తెలిపారు.

పోలవరం కట్టేది.. నిర్వాసితులకు న్యాయం చేసేది టిడిపినే

నిర్వాసితులతో లోకేష్ మాట్లాడుతూ పోలవరం పూర్తి చేసేది, నిర్వాసితులకు న్యాయం చేసేది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. చంద్రబాబు హయాంలో 72 శాతం పోలవరం పనులు పూర్తయ్యాయన్నారు. రూ.లక్షా 15 వేల ప్యాకేజీని రూ.6.36 లక్షలకు పెంచింది చంద్రబాబేనన్నారు. రూ.నాలుగు వేల


లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మొడియం శ్రీనివాస్, బొరగం శ్రీనివాస్

కోట్లు నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసం కోసం ఖర్చు చేసింది టిడిపినే అన్నారు. పాలిచ్చే ఆవుని వద్దనుకుని తన్నే దున్నపోతుని తెచ్చుకున్నారన్నారు. రూ.పది లక్షలు ప్యాకేజీ అని, గతంలో సేకరించిన భూములకు అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు తన చేతుల్లో ఏమీ లేదు..


బస్సులో ప్రయాణికులతో లోకేష్ కరచాలనం

కేంద్రం బటన్ నొక్కితేనే నిర్వాసితులకు డబ్బులు అని జగన్ అంటున్నాడని విమర్శించారు. జగన్ ఒక్క ఇల్లూ కట్టలేదు.. ఒక్కరికీ పూర్తిగా ప్యాకేజీ అమలు చేయలేదని అన్నారు. జగన్ ఇప్పుడు ఎన్నికలకు వెళ్తే 25 సీట్లు వస్తాయని, మరో ఆరు నెలలు పోతే సింగిల్ డిజిట్‌నే అని, అందుకే జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లబోతున్నాడని సమాచారం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి సిద్ధంగా ఉందని తెలిపారు. దొంగ కాగితాలు సృష్టించి నిర్వాసితులకు రావాల్సిన వందల కోట్లు వైసిపి నేతలు కొట్టేశారన్నారు. 2017లో జరిగిన సర్వేకు టిడిపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దాని ఆధారంగానే ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన ఆధిపత్య పోరు

పోలవరం నియోజకవర్గంలో లోకేష్ పర్యటన సందర్భంగా టిడిపిలో ఆధిపత్య పోరు మరోసారి బయటపడింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్ మధ్య ఆధిపత్య పోరు నెలకొన్న సంగతి తెలిసిందే. ఫ్లెక్సీల ఏర్పాటులో బొరగం శ్రీనివాస్ ఫొటో చిన్నదిగా పెట్టడం వంటి విషయాలపై ఇరుగ్రూపుల్లో పోటీ నెలకొంది. ఆ కారణంగానే పోలవరం నియోజకవర్గంలో సాగిన యాత్రలో మిగిలిన చోట్ల కంటే జనాదరణ తగ్గిందనే చర్చ నడిచింది.

ధరల అదుపులో బిజెపి విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


కలిదిండిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం చేపట్టిన సమరభేరిని మంగళవారం ఉదయం తంగెళ్లమూడి ప్రాంతంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిత్యావసర సరుకుల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. నిరుద్యోగులను పకోడీలు వేసుకుని బతకండంటూ బిజెపి నేతలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించిందని విమర్శించారు. మన రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి పార్లమెంట్లో మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎస్.సత్యనారాయణ, ఎం.ఇస్సాక్, ఏసుబాబు, మీసాల సత్యం, పైడియ్య, షేక్ కరీముల్లా, షేక్ సైదాని పాల్గొన్నారు.

కలిదిండి: మూలలంక, పెదలంక గ్రామాల్లో సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ, అధిక ధరలు తగ్గించాలని కోరుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు కుడిపూడి శ్రీనివాసరావు, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ, జక్కుల మహేష్, జోగి ఏసు, గద్దె అనిల్ కుమార్, చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.


ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

'ప్రజాశక్తి' మరింత పురోగమించాలి

43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాశక్తి దినపత్రిక మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని, భవిష్యత్తులో మరింతగా పురోగమిస్తూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. మంగళవారం ప్రజాశక్తి ఏలూరు, నూజివీడు డివిజన్ల 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తూ సమస్యల పరిష్కారానికి 'ప్రజాశక్తి' కృషి చేయాలన్నారు. వాస్తవాలు క్షుణ్ణంగా పరిశీలించి పత్రికలో ప్రచురిస్తే ప్రజాదరణ ఉంటుందని, అప్పుడే పత్రికల జనాల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో ప్రజాశక్తి తనదైన పాత్ర పోషించాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రచురించడంలో 'ప్రజాశక్తి'కి ప్రత్యేకత ఉందని, భవిష్యత్తులో అదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు 'ప్రజాశక్తి' వెలుగులోకి తీసుకొస్తే అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్, డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్‌వి.ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు, సిబ్బంది వై.సీతారాం, ఎం.సాంబమూర్తి, టి.సత్యవతి, విలేకరులు వి.శ్యాంబాబు, యు.శ్రీనివాస్, డి.నాని పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి స్ఫూర్తితో తెలుగును రక్షించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

తెలుగు భాషా ఉద్యమ నాయకులు గిడుగు రామ్మూర్తి స్ఫూర్తితో మన రాష్ట్రంలో తెలుగు భాష రక్షణ కోసం ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో జరిగిన సభకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కస్తూరిరావు అధ్యక్షత వహించారు. సభలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి సాబ్జీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సభలో డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ వై.ఆనందనాయుడు, రావి పద్మ, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, విజ్ఞాన కేంద్రం సభ్యులు ఎబి.త్రిపురసుందరి, మేతర అజయ్‌బాబు, జి.శారద, జి.నీలిమ. కె.శ్రావణికుమారి మాట్లాడారు. అనంతరం ఉపన్యాసం, పాటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.


గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు


ప్లాంటేషన్లు పరిశీలిస్తున్న డిఎఫ్‌ఒ

ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి : డిఎఫ్‌ఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రధామ తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రమ్మ కాలనీ, రామన్నపాలెం, జిల్లెళ్లగూడెం, ములగలంపల్లి పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా నాటిన రోజ్‌ఉడ్, వేగిస, మద్ది, చిందుగ, సోమిత, థాని వంటి రకాల మారుజాతి మొక్కల ప్లాంటేషన్‌లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రధామ మాట్లాడుతూ మండలంలో నాటిన వివిధ రకాల మారుజాతి మొక్కలు సజావుగా పెరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ఎరువులను సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు రాజమండ్రి సిసిఎఫ్ శర్వానన్, జంగారెడ్డిగూడెం అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీవాణి, డిప్యూటీ రేంజ్ అధికారి, విశ్వేశ్వరరావు, సెక్షన్ అధికారి దినేష్, బీట్ అధికారి మారేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపినేతలు

'జగన్ పాలనలో రాజ్యమేలుతున్న ఇసుక మాఫియా'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జగన్ పాలన ఇసుక మాఫియాగా తయారైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో నిల్వచేసిన ఇసుక వద్ద టిడిపి నేతలతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో పేదల ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందించిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. పేదలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని ఆయన వైసిపిని డిమాండ్ చేశారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగే లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ కోరారు. మంగళవారం పార్టీ పట్టణ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు స్థానిక గంగానమ్మ గుడి సెంటర్‌లో లోకేష్ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పట్టణ వ్యాపారులు, రైతులు, కార్మిక సంఘాలు, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం - తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో మంగళవారం పైపులైను వేస్తుండగా విద్యుత్ స్తంభం ఒక్కసారిగా ఒరిగిపోయింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే స్తంభం ఒరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వికలాంగులకు వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు


ఫిజియోథెరపీ చేస్తున్న ప్రశాంతి

వికలాంగ పిల్లలు ప్రతీరోజు వ్యాయామం చేయాలని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. ముసునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్ ఆధ్వర్యాన జి.ప్రశాంతి విద్యార్థులకు మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.హన్నమణి, ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మి నారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళపై ముగ్గురు దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వివాహితపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసిన సంఘటన మంగళవారం నూజివీడు బైపాస్ రహదారిపై చోటుచేసుకుంది. బాధితురాలి తండ్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బైపాస్ రోడ్డులో నూజివీడు పట్టణానికి చెందిన పొట్లు నాగశిరోమణి(32) మొక్కజొన్న పొత్తులు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఆ దుకాణం నిర్వహించే స్థలం తమదంటూ అదే ప్రాంతానికి చెందిన శ్రీను, చిట్టిబాబు, లక్ష్మీ దాడి చేసి తన కుమార్తెను గాయపరిచారని తండ్రి తెలిపాడు. ప్రస్తుతం నాగశిరోమణి నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటనపై విచారణ చేపట్టామని నూజివీడు పట్టణ పోలీసులు తెలిపారు.

చేపల చెరువులో పడవ బోల్తా

ఒకరు మృతి - ముగ్గురు సురక్షితం

ప్రజాశక్తి - భీమడోలు


మృతిచెందిన సజ్జన్

చేపల చెరువులో పడవ బోల్తాపడి యువకుడు మృతి సంఘటన ఆగడాలలంకలో మంగళవారం చోటుచేసుకుంది. భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆగడాలలంక గ్రామానికి చెందిన వెంప సజ్జన్(18)తో పాటు మరో ఇద్దరు కలిసి 40 ఎకరాల విస్తీర్ణంలోని పది అడుగులలోతు గల చేపల చెరువు మీదుగా పశువులకు గడ్డి కోసం రేకుపడవలో కొల్లేరు ప్రాంతానికి వెళ్లారు. గడ్డి కోసిన అనంతరం తిరుగుప్రయాణంలో వారి పడవ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఇద్దరు యువకులు ఈదుకుంటూ గట్టుకు చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. సజ్జన్ మాత్రం చెరువులో మునిగిపోయాడు.

ర్యాగింగ్ తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఓ నర్సింగ్ విద్యార్థిని సీనియర్ల ర్యాగింగ్ భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దెందులూరు మండలానికి చెందిన విద్యార్థిని(18) బిఎస్‌ఎం నర్సింగ్ కాలేజీలో చదువుతోంది. ఆమె చేరినప్పటి నుంచి సీనియర్ విద్యార్థినులు వేధింపులకు గురి చేస్తుండటంతో భరించలేక సోమవారం అర్ధరాత్రి పారాసిటమాల్ మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యకు యత్నించింది. మంగళవారం ఉదయం ఆమె పరిస్థితి తెలుసుకున్న తోటి విద్యార్థినులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


టి.నరసాపురం మండలంలో..

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిను పురస్కరించుకుని హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎంహెచ్‌ఎ హాలు ఆవరణలో తెలుగుతల్లి విగ్రహానికి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటి ఉపాధ్యక్షులు బివి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పూలమాలలు వేశారు. అనంతరం సంగీత విద్యార్థులచే 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ', తెలుగు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష కీర్తికి గిడుగు రామ్మూర్తి విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌ఛార్జి వేమా కోటేశ్వరరావు, సమన్వయకర్త, కార్య నిర్వాహక కమిటి సహాయ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు(ఎల్‌విఆర్), మోతే శ్రీనివాస నారాయణరావు, ఆర్‌ఎన్‌ఆర్ నాగేశ్వరరావు, పిలగల కొండలరావు పాల్గొన్నారు.

స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, 'మాతృదేవోభవ సేవా ట్రస్ట్' సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా 'తెలుగు భాషా దినోత్సవాన్ని' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ గుత్తా గిరిబాబు, తెలుగు అధ్యాపకులు ఎస్.పరమేష్, సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, కూచింపూడి సత్యనారాయణ, కె.అజయ్ కుమార్ మాట్లాడారు. వి.వెంకటరావు, ఎస్.సుష్మలత, ఎం.రాంబాబు, పిఆర్.కావ్యశ్రీ, ఎన్.విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని బాలికల జెడ్‌పి హైస్కూల్లో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాతృభాష గొప్పతనాన్ని తెలిపేలా పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనం, మాధుర్యం గ్రహిస్తే ఇతర భాషల పట్ల పట్టు సాధించగలమన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు.


నూజివీడు మండలంలో..

చింతలపూడి : తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు విశేష కృషి చేశారని చింతలపూడి డిగ్రీ కళాశాల రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు మల్లెల జయరాజు అన్నారు. పట్టణంలో గిడుగు రామ్మూర్తి 160వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్యకుమార్, ఆర్నేపల్లి అప్పారావు, మాదాసు పుల్లారావు, సంకు జోషి, నత్త వెంకటేశ్వర్‌రావు, ఆర్‌విఎస్.నారాయణ పాల్గొన్నారు.

గొల్లపల్లిలోని అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, కలపాల ఏసుపాదంను సత్కరించారు. క్రీడాంశాలు, తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక విద్యావికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్, వి.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు, వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ పి.లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ప్రతిభా పాఠశాలలో ప్రిన్సిపల్ సరోజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు డిపార్ట్‌మెంట్ ఉపాధ్యాయులు తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రావు, పూర్ణిమ, ధనలక్ష్మి, ఉష, నజీరున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో..

టి.నరసాపురం : స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 'అ ఆ' ఆకారంలో విద్యార్థులు అలరించారు. గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కె.దుర్గారావు, ఉపాధ్యాయులు జి.విజయలక్ష్మి, టి.అరుణ, జి.వరలక్ష్మి, ఎస్తేరు రాణి, పుష్పావతి, రాజేశ్వరి, రమ్యశ్రీ పాల్గొన్నారు.

భీమడోలు: విద్యతోపాటు ఆరోగ్య పరిరక్షణకు సహకరించే క్రీడలకూ విద్యార్థులు సమప్రాధాన్యతివ్వాలని పలువురు వక్తలు సూచించారు. మండలంలోని పలువిద్యాసంస్థలు, శాఖా గ్రంథాలయాల్లో తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతులను పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నేవారిగూడెంలోని ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో తెలుగు పద్యాల కంఠస్థ పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకున్న కాంచన వాషిక, పరుగు పందేల పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న శివ గణేష్‌కు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు దుర్గా ప్రసాద్‌ను సత్కరించారు. తొలుత. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెఎంఎం.పురం ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, ఉపాధ్యాయులు మండే సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గంథపాలకులు కె.శ్రీనివాసరావు క్రీడల ప్రాముఖ్యతను ప్రముఖులు విద్యార్థులకు వివరించారు.

పోలవరం : గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్, ఉపాధ్యాయులు, బొరుసు బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు విజయనిర్మల విద్యార్థులకు స్వీట్స్ పంచారు.

బుట్టాయగూడెం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడ, భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, మ్యూజికల్ చైర్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహేంద్రరావు, వైస్‌ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు శ్రీను, భాగ్యలక్ష్మి, రవి, సిబ్బంది సత్యనారాయణ, శ్యామల పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక శ్రీసాయిగీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్లో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధుప్రియ, డైరెక్టర్ శివకోటియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగుభాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 120 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, సర్పంచి రంగు ధనలక్ష్మిగాంధీ, ఎంపిటిసి కొండా దుర్గాభవాని, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.


ముసునూరు మండలంలో..

సిపిఎం సమరభేరిని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 28 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ నిర్వహిస్తున్న సిపిఎం సమరభేరిని విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం అఖిల భారత కమిటీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 2014కు ముందు గ్యాస్ ధర రూ.450 ఉండేదని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1150కి చేరిందన్నారు. పెట్రోల్ రూ.70 నుండి రూ.112కు పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.శివకుమార్, జి.గోపి, మద్రి త్రిమూర్తులు, ఎస్‌కె.జాంగ్రీ, వి.దుర్గాప్రసాద్, వి.సురేష్, రాచూరి దుర్గారావు, రాచూరి నాగేశ్వరరావు, ఏలేటి మంగరాజు పాల్గొన్నారు.

నిడమర్రు: నిత్యావసరాల ధరల అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. మంగళవారం నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో గరవ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడారు. సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరిని ఈనెల 28 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో నిత్యావసరాల ధరలతో పాటు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదలపై భారాలు మోపిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా మోసగించిందన్నారు. దీనిపై నిలదీయాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి మద్దతు తెలపడం దారుణమన్నారు. అనంతరం సిపిఎం సమర భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోన శ్రీనివాసరావు, కంచ వరప్రసాద్, లావేటి చంద్రరావు, వెలగలేటి మోహన్, పెద్దిరాజు రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న సుజాతనాయుడు

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సమితి జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాత నాయుడు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జయరాజు మాట్లాడుతూ గడిచిన 16 సంవత్సరాలలో సంఘం సాధించిన హక్కులు, విజయాలను వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ వికలాంగుల 36 డిమాండ్లపై నిరంతర పోరాటం చేస్తున్న ఏకైక సంఘం వికలాంగుల హక్కుల పోరాట సమితి మాత్రమేనన్నారు. మహిళా అధ్యక్షురాలు పి.మేరీ మాట్లాడుతూ వికలాంగులు హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు వికలాంగుల ఉద్యమాలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బి.కిరణ్‌కుమార్, జిల్లాలోని 28 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి : గన్ని



మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

భీమడోలు: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కార్యకర్తలు, అభిమానులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి పార్టీ విస్తృత సమావేశం గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో సుమారు 40 నుంచి 45 రోజుల పాటు కొనసాగే భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై పార్టీకి చెందిన క్లస్టర్, యూనిట్, బూత్‌స్థాయి బాధ్యులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉంగుటూరు నియోజకవర్గపరిధిలో వచ్చేనెల రెండో తేదీ నుంచి కొనసాగే నారా లోకేష్ యువగళం పాదయాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రాథమిక వివరాల మేరకు లోకేష్ పాదయాత్ర రెండో తేదీన నల్లజర్ల మండలం సింగరాజుపాలెం మీదిగా ఉంగుటూరు మండలం నీలాద్రిపురం వద్ద ఉంగుటూరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. అదేరోజు నారాయణపురంలో రాత్రి బస చేస్తారని, మూడో తేదీన పందికోడు, పెదనింద్రకొలను మీదుగా నిడమర్రు చేరుకుటుందని తెలిపారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారని తెలిపారు. ఆ తర్వాత భువనపల్లి, గణపవరం మీదుగా సాగుతుందన్నారు. రాత్రి నియోజకవర్గ శివారు గ్రామంలో బస చేస్తారన్నారు. మరుసటి రోజు యాత్ర ఉండి నియోజకవర్గంలోకి వెళ్తుందని తెలిపారు. యాత్ర కొనసాగే రూట్, ఇతర వివరాలు అధికారికంగా ఖరారు కావాల్సి ఉందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి చేపట్టాల్సిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నియోజకవర్గ పరిధిలో లోకేష్ పర్యటన పూర్తయిన తర్వాత కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా ఎన్‌ఆర్‌ఐ ధనియాల వెంకటేశ్వరరావు హాజరయ్యారు .


రాఖీలు కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

జోరుగా రాఖీల విక్రయాలు

ముదినేపల్లి : మండల కేంద్రమైన ముదినేపల్లిలో రక్షాబంధన్‌ను పురస్కరించుకుని రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అన్నాచెల్లెలు అనుబంధానికి ప్రతీక అయిన రాఖీని జరుపుకునేందుకు యువత ఎక్కువ మక్కువ చూపుతారు. దీంతో ముదినేపల్లిలోని గురజ రోడ్డు, కైకలూరు రోడ్డు, బంటుమిల్లి రోడ్ల సెంటర్లల్లో వ్యాపారులు రాఖీ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. విద్యార్థులు, యువకులు పెద్దసంఖ్యలో దుకాణాల వద్దకు చేరి రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. రూ.20 నుంచి రూ.500 వరకూ రాఖీల ధరలున్నాయి. ఈసారి మార్కెట్‌లోకి చంద్రయాన్ పేరుతో రాఖీలు రావడం విశేషం. వీటి పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ మృతికి కార్డియాక్ అరెస్టే కారణం

డిఎంహెచ్‌ఒ ఆశ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంకన్నగూడెం అగ్రికల్చర్ అసిస్టెంట్ కణితి వినోద్ మృతికి డెంగీ కారణం కాదని, కార్డియాక్ అరెస్టుతోనే మృతిచెందాడని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశా తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో డెంగీతో వినోద్ మృతిచెందినట్లు వచ్చిన వార్తపై ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అంకన్నగూడెం సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆర్‌ఎంపితో వైద్యం చేయించుకున్నా తగ్గకపోవడంతో జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్నాడని, ఈ పరీక్షల్లో టైఫాయిడ్, కామెర్లు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్సపొంది డిశ్చార్జ్ అయ్యాడని, మళ్లీ 27వ తేదీన కడుపునొప్పి రావడంతో జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం కడుపు నొప్పి భరించలేక కార్డియాక్ అరెస్ట్‌తో మృతిచెందినట్లు రాచన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దివ్య తెలిపినట్లు డిఎంహెచ్‌ఒ తెలిపారు.


మాట్లాడుతున్న పయనీయర్ కంపెనీ ప్రతినిధి

'పయనీర్' ఆధ్వర్యాన రక్షాబంధన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రముఖ మొక్కజొన్న విత్తన ఉత్పత్తి సంస్థ పయనీర్ 50 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా పలు గ్రామాల రైతులకు రక్షాబంధన్ కార్యక్రమంతో సత్కరిస్తున్నామని పయనీర్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ రిప్రజెంటేటివ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని మైసన్నగూడెం అక్కంపేట, పట్టెన్నపాలెం, కేతవరం, పుట్లగట్లగూడెం గ్రామాల్లో మొక్కజొన్న రైతులతో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న విత్తన ఉత్పత్తిలో రైతుల నమ్మకానికి చిరునామాగా పయనీర్ సంస్థ పేరుగాంచిందన్నారు. అనంతరం మొక్కజొన్న రైతులకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పయనీర్ సంస్థ ప్రతినిధులు కె.వివేక్, పయనీర్ ప్రవక్త రైతులు వై.శ్రీనివాస్, బుజ్జిబాబు, పంతులు, కె.అప్పారావు, నాగార్జున, బి.శ్రీనివాస్, ఎం.రమేష్, జైపాల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో నారాయణపురం ఉపాధ్యాయునికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉంగుటూరు మండలం నారాయణపురం జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు గొల్లపల్లి రామారావు ప్రథమ స్థానం సాధించాడు. స్పోర్ట్స్ డే సందర్భంగా వివిధ స్థాయిపోటీలను నిర్వహించారు. 40-45 వయస్సు వారికి నిర్వహించిన పరుగు పోటీల్లో యుటిఎఫ్ జిల్లా క్రీడా కన్వీనర్ రామారావు ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

'పోలవరం' పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తెల్లంవారిగూడెంలోని కృపాసువార్త మందిరంలో పోలవరం నియోజకవర్గ ఆదివాసీ పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మడకం రమేష్, ఉపాధ్యక్షులుగా తాతి సురేష్, సెక్రటరీగా మొడియం ఇజ్రాయిల్, కోశాధికారిగా సరియం ఇస్సాకు, జాయింట్ సెక్రటరీగా మడకం పీటర్సన్, గౌరవ అధ్యక్షులుగా సరియం ఐజాక్ ఎన్నికయ్యారు.